

నేడు వాహనాల బహిరంగ వేలం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు స్పెషల్ ఎన్ఫోర్స్ మెంట్ బ్యూరో స్టేషన్‌లో సీజ్ చేసిన వాహనాలు బహిరంగ వేలంను ఈనెల 9న మధ్యాహ్నం 2 గంటలకు వేస్తున్నట్లు సిఐ ఎ.సంతోష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పెషల్ ఎన్ఫోర్స్ మెంట్ బ్యూరో (ఎస్ఇబి) పాడేరు పరిధిలోని వివిధ ప్రాంతాల్లో జరిపిన దాడుల్లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ నేరాల్లో పలు వాహనాలు సీజ్ చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ మేరకు పాడేరు అసిస్టెంట్ ఎన్ఫోర్స్ మెంట్ బ్యూరో సూపరింటెండెంట్ పర్యవేక్షణలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంవిఐ నిర్ధారించిన ధర నుంచి వేలం పాడిన ధరకు అదనంగా జిఎస్‌టి చెల్లించాలన్నారు. పాటలో పాల్గొనదలచిన వారు ముందుగా రూ.5 వేలు అడ్వాన్స్ చెల్లించి పేరు నమోదు చేయించుకొని టోకెన్‌లు పొందాలన్నారు. వేలం పాటలో వాహనాలు పొందని వారికి అడ్వాన్స్ నగదు వెంటనే తిరిగి ఇస్తామని పేర్కొన్నారు. ఈ విషయాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

ప్రజా ఉద్యమాల అణచివేతకే జిఓ 1

- భవిష్యత్తులో ఐక్యంగా పోరాటాలు
- సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స
- అఖిలపక్షం పార్టీల రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: ప్రజా ఉద్యమాలను అణచి వేయడానికే రాష్ట్ర ప్రభుత్వం జీఓ 1ని తీసుకొచ్చిందని సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స విమర్శించారు. సిపిఎం అల్లూరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అరకువేలి గిరిజన సంఘం కార్యాలయంలో జీఓ 1ను వ్యతిరేకిస్తూ బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. అనంతరం సీపీఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స మాట్లాడుతూ, బ్రిటిష్ కాలం నాటి చట్టాన్ని తీసుకొచ్చి ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాలు, చేస్తున్న పోరాటాన్ని అణిచివేయడానికి జీఓ 1ని తీసుకొచ్చారని తెలిపారు. సిఎం జగన్ నిరంకుశంగా వ్యవహస్తున్నారని ధ్వజమెత్తారు. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ప్రతీపక్షం నాయకులను, ప్రజా సంఘాల నాయకులను ముందస్తుగా ఎక్కడికక్కడే హౌస్ అరెస్టు చేస్తుందన్నారు. రోడ్డుపై అరెస్టులు చేసి, నిర్బంధిస్తుందని పేర్కొన్నారు. జగన్ ప్రభుత్వం బ్రిటిష్ ప్రభుత్వం చేసిన చట్టాల్ని తీసుకొచ్చి ప్రజలపై ఉక్కు పాదం మోపాలని చూస్తున్నారని విమర్శించారు. వైసిపి పార్టీ రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. సభలు, సమావేశాలు జరపకూడదనే నిబంధనలు పెట్టడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. జీఓ 1ని రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రద్దు చేయని పక్షంలో భవిష్యత్తులో ప్రజా సంఘాలు, ప్రతిపక్ష పార్టీలు కలిసి కట్టుగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

తెలుగుదేశం పార్టీ అరకు మండల అధ్యక్షులు శెట్టి బాబురావు మాట్లాడుతూ, సిఎం జగన్ ప్రతిపక్షాలు గొంతు నొక్కే ప్రయత్నం చేస్తే సహించేది లేదని అన్నారు.

జనసేన అరకు పార్లమెంట్ కన్వీనర్ మాదల శ్రీరామ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో వైయస్సార్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నుండి ప్రజలకు అనేక కష్టాలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.

గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ అనుమతి రద్దు చేయాలన్నారు. ఇటువంటి చీకటి జీఓను తీసుకొచ్చి ప్రజా ఉద్యమాన్ని అణచి వేస్తుందని, ఉపాధ్యాయులను కూడా వదలకుండా భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి పి.రామన్న, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు, అరకు వేలి మాజీ వైస్ ఎంపీపీ వద్దు అమ్మన్న, హ్యూమన్ రైట్స్ ఫారం కన్వీనర్ చిరంజీవి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రభుదాసు, టిడిపి నాయకులు కృష్ణ, కాంగ్రెస్ జిల్లా నాయకులు పి.స్వామి, సిఐటియు నాయకులు మగ్గన్న, తదితరులు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపిపి వెంకటలక్ష్మి తదితరులు

రక్తదానంపై అపోహలొద్దు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

రక్తదానంపై అపోహలు వద్దని ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, అల్లూరి జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ గంగరాజు అన్నారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాల మేరకు స్థానిక వెలుగు కార్యాలయం వద్ద రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ఎంపీపీ గోము వెంకటలక్ష్మి తదితరులు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రక్తదానం చేయడం మంచిదేనని, దానివల్ల ఎటువంటి దుష్ప్రభావాలు ఉండవని తెలిపారు. అత్యవసర సమయంలో అవసరమైన వారికి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలన్నారు. మన్యంలో ఎంతో మంది గర్భిణులు, బాలింతలు, గిరిజన బాలికలు మృత్యువాత పడుతున్న నేపథ్యంలో వారికి సహృదయంతో దాతులు ఇచ్చే రక్తం వలన ప్రాణాలు నిలబెట్టవచ్చని తెలిపారు. ప్రమాదాల బారిన పడిన వారికి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ కె బాపన్నదొర, తహశీల్దార్ సుబ్రహ్మణ్యాచారి, వైసిపి జిల్లా నాయకులు దాట్ల వెంకటేష్‌రాజు, రాజవొమ్మంగి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి లిఖిత, ఎంఈవో కె.తాతబ్బాయిదొర, వెలుగు ఎపియం ఆదినారాయణ, ఉపాధి హామీ ఎపివో సురేష్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


మృతుడు లోవరాజు కుటుంబంతో మాట్లాడుతున్న ఎంపిడిఓ ఉమామహేశ్వరరావు

ఆకులూరులో ఎంపిడిఓ పర్యటన

'కల్తీ కల్లు' మృతుని కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం గాలికొండ పంచాయతీ ఆకులూరి గ్రామాన్ని జికె.వీధి ఎంపీడీవో ఉమామహేశ్వరరావు బుధవారం సందర్శించారు. జీలుగు కళ్ళు తాగి మృతి చెందిన పాంగి లోవరాజు కుటుంబ సభ్యులను పరామర్శించారు. గిరిజనులు జీలుగు కళ్ళు తాగి నలుగురు తీవ్ర అస్వస్థకు గురైన సంఘటనపై కుటుంబ సభ్యులను, గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో ఎంపీడీవో మాట్లాడుతూ జీలుగు కళ్ళు తాగిన నలుగురిలో లోవరాజు తండ్రి పాంగి రామదాసు ప్రస్తుతం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. మృతుడు పాంగి లోవరాజు కుటుంబ సభ్యులకు ప్రభుత్వం నుంచి రావలసిన వైఎస్ఆర్ బీమా, లోవరాజు భార్యకు వితంతు పెన్షన్, జాబ్ కార్డు ద్వారా ఏమైనా ప్రభుత్వం నుంచి లబ్ధి చేకూరితే వాటిపై దృష్టి సారించి ఆర్థికంగా ఆదుకుంటామని చెప్పారు. ఎంపిడిఓ వెంట పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులున్నారు.

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం

-డిఎం అండ్ హెచ్ఓ జమాల్ భాషా- జిల్లా ఆసుపత్రిలో ప్రమాద బాధితులకు పరామర్శ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా పెదబయలు మండలం గలగండ గ్రామం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన 5 మందిని హుటాహుటిన 108 వాహనంలో జిల్లా జిల్లా ఆసుపత్రికి తరలించి తరలించి వైద్య సేవలందిస్తున్నామని డిఎం అండ్ హెచ్ఓ సి.జమాల్ భాషా తెలిపారు. బుధవారం జిల్లా ఆసుపత్రిలో బాధితులని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అత్యవసర, మెరుగైన వైద్యం వైద్య సేవల కోసం విశాఖ కెజిహెచ్ కు తరలించాలని సూపరింటెండెంట్ కె.కృష్ణారావును ఆదేశించారు. అనంతరం డయాల్సిస్ సెంటర్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. వైద్య సేవలను, రోజువారి కేసుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి ప్రసూతి విభాగం పై భాగంలో ఉన్న మరుగుదొడ్ల వద్ద ఆడ శిశువును వదిలి వెళ్లిన సంఘటనను తెలుసుకుని శిశువు ఆరోగ్య పరిస్థితిని వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. శిశువు ఆరోగ్య పరిస్థితి మెరుగు పడ్డాక శిశు సంరక్షణకు శిశు సంక్షేమ శాఖ అధికారికి అప్పజెప్పాలని ఆదేశించారు. ఆయన వెంట ఎడిఎంహెచ్ఓ కె.లీలాప్రసాద్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.కె.కృష్ణారావు, ఎపిడమిక్ సెల్ ఆరోగ్య విస్తరణ అధికారి జి.సింహాద్రి, జిల్లా టిబి పర్యవేక్షకులు వి.కిరణ్, వైద్య సిబ్బంది పాల్గున్నారు.


క్షతగాత్రులను పరామర్శిస్తున్న డిఎంహెచ్ఓ


పట్టుబడిన నాటు సారా తయారీ పాత్రలు

నాటుసారా తయారీ స్థావరాలపై దాడి

2,500 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం

ప్రజాశక్తి-కొయ్యూరు

ఆపరేషన్ పరివర్తనలో కార్యక్రమంలో భాగంగా నాటుసారా స్థావరాలపై కొయ్యూరు పోలీస్ సిబ్బంది బుధవారం దాడులు నిర్వహించి 2,500 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశారు. కొయ్యూరు సీఐ స్వామినాయుడు ఆధ్వర్యంలో ఎస్సై రాజారావు, సిబ్బంది, ఏపీఎస్పీ, మహిళా పోలీసులతో కలిసి నాటు సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. మండలంలోని కొప్పుకొండ గ్రామ శివారులో నాటు సారా తయారీ జరుగుతుందని ముందస్తు సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడులలో 2,500 లీటర్ల బెల్లం పులుపును వంట సామాగ్రిని డ్రమ్ములను ధ్వంసం చేశారు. అనంతరం ఆయా గ్రామాల గిరిజనులతో సమావేశమైన పోలీసులు నాటుసారా వల్ల కలిగే అనర్ధాలపై అవగాహన కల్పించారు. నాటు సారా తయారీ క్రయవిక్రయాలు చట్ట వ్యతిరేకమని అటువంటి చర్యలకు ఎవరు పాల్పడినా చట్ట ప్రకారం ఏడేళ్ల వరకు జైలు శిక్ష విధించబడునని తెలిపారు.

సిసి రోడ్లు నిర్మించాలి

ప్రజాశక్తి - రంపచోడవరం


మండలం లోని చిన గెద్దాడ, చెదలవారి వీధిలో సిసి రోడ్లు నిర్మించాలని గిరిజన సంఘం మండల అధ్యక్షులు సాదల విద్యాసాగర్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన స్థానికులతో కలిసి గ్రామానికి వెళ్లే రహదారిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి వెళ్లే రహదారి వర్షాకాలం వస్తే నడవడానికి వీలు లేకుండా, బురదమయమై ఉంటుందని తెలిపారు. సిసి రోడ్లు, వీధి రోడ్లు వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కడబాల చంద్ర, కడబాల ఈశ్వర్ రెడ్డి, కుర్ల బాపురెడ్డి, కుర్ల వెంకట రెడ్డి, ముర్ల సత్యవతి, ముర్ల అక్కాయమ్మ, ముర్ల మంగమ్మ, ముర్ల సీతమ్మ, ముర్ల కృష్ణ కుమారి, చెదల సత్యవతి తదితరులు పాల్గొన్నారు.


శిథిలమైన రోడ్డును పరిశీలిస్తున్న గిరిజన సంఘం నాయకులు విద్యాసాగర్ రెడ్డి తదితరులు


రోగిని ఆరోగ్య వివరాలు అడుగుతున్న వైద్యాధికారి

కోర్రాయిలో మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: మండలంలోని కిలోగుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి కోర్రాయి సబ్ సెంటర్ లో బుధవారం మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి హాజరైన వైద్యాధికారిని కె.కరుణ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, వ్యాధులు ప్రబలితే నిర్లక్ష్యం వహించకుండా వైద్య సిబ్బందిని ఆశ్రయించి చికిత్స చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య వంతులుగా ఉండాలని ఆమె సూచించారు. భోజన సమయాల్లో కాచి చల్లార్చిన నీటిని వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది జానికమ్మ, ఆశ వర్కర్లు, హెల్త్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కి వినతిపత్రం ఇస్తున్న దొన్నుదొర

టిడిపి నేతల వినతి

ప్రజాశక్తి-హుకుంపేట: వైసిపి ప్రభుత్వం పేద విద్యార్థులకు విదేశీ విద్యను దూరం చేసిందని తెలుగుదేశం పార్టీ ఎస్‌టి సెల్ రాష్ట్ర అధ్యక్షులు సివేరి దొన్ను దొర విమర్శించారు. తహసిల్దార్ రాజ్యలక్ష్మికి బుధవారం వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, చంద్రబాబు హయాంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారి టీల విదేశీ విద్యకు రూ.10 లక్షలు ఇచ్చారన్నారు. జగన్ రెడ్డి పాదయాత్ర సమయంలో విదేశీ విద్యకు రూ.20 లక్షలు పెంచుతున్నానని హామీ ఇచ్చి. నేటికీ అమలు చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శులు గబ్బడ సింహాచలం, శ్యామ్ సుందర్, అధికార ప్రతినిధి వెంకట లక్ష్మి, రమేష్ నాయుడు, పాడేరు ఎంపిటీసీ ఉషారాణి, అరకు అసెంబ్లీ కార్యదర్శులు సంతోష్ కుమార్, శంకర్, సర్పంచ్ లక్ష్మయ్య, ఉప సర్పంచ్ మత్స్యరాజు, మాజీ సర్పంచ్ మహదేవ్, నాయకులు నాగేష్, జగన్ కుమార్, ఈశ్వర్, దామోదర, లచ్చన్న దొర పాల్గొన్నారు.

ఐటిడిఎ కోర్టు కేసుల విచారణ వాయిదా

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఈనెల పదో తేదీన ఐటిడిఎలో నిర్వహించాల్సిన కోర్టు కేసుల విచారణ తాత్కాలికంగా వాయిదా వేస్తున్నామని ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలక్రిష్ణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తదుపరి కోర్టు కేసులు విచారణ ఎప్పుడు నిర్వహించేది కక్షిదారులకు నోటీసులు జారీ చేస్తామని పేర్కొన్నారు. శుక్రవారం కోర్టు కేసు నిమిత్తం ఎవరు ఐటిడిఎకి రావద్దని కోరారు.

రాఘవపురం గ్రామానికి ఆర్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి

సిపిఎం నాయకులు మాధవరావు

ప్రజాశక్తి-ఎటపాక

మండలంలోని నల్లకుంట గ్రామపంచాయతీ పరిధి రాఘవపురం గ్రామాన్ని పోలవరం ముప్పు జాబితాలో చేర్చి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లించాలని సిపిఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు డేగల మాధవరావు డిమాండ్ చేశారు. సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటికి సీపీఎంలో భాగంగా బుధవారం రాఘవపురం గ్రామంలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అనేక సమస్యలు సిపిఎం బృందం దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ పోలవరం ముంపులో ఉన్న రాఘవపురం గ్రామానికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, భూమికి భూమి ఇవ్వాలని కోరారు. అధికారులు మాత్రం ఈ గ్రామానికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ జాబితాలో లేదని ప్రకటనలు చేస్తున్నారని, ఇటువంటి ప్రకటనలు మానుకొని సర్వే చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల పోలవరం బ్యాక్ వాటర్‌తో ఈ గ్రామం మొత్తం పూర్తిగా నీట మునిగి సర్వస్వం కోల్పోయి నిరాశ్రయులయ్యారని గుర్తు చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం నష్ట పరిహారం కూడా ఇవ్వలేదన్నారు. అనేక సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న భూములను ఆన్లైన్లో చేర్చకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. తక్షణమే ఆన్లైన్ చేసి నష్టపరిహారం ఇవ్వాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు సోయం వీరమ్మ, కాకా అర్జున్, సోంది రామారావు, ఊకె బాబు, జి హరి పాల్గొన్నారు.



ఇంటింటికీ సిపిఎంలో కరపత్రం ఇచ్చి సమస్యలు తెలుసుకుంటున్న ఆ పార్టీ నాయకులు

చింతపల్లి సిహెచ్‌సిలో పోస్టుమార్టానికి వైద్యాధికారిని నియమించాలి

గాలికొండ ఎంపిటిసి బుజ్జిబాబు

ప్రజాశక్తి -సీలేరు

చింతపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించడానికి ప్రత్యేక వైద్యాధికారిని నియమించాలని గాలికొండ ఎంపీటీసీ అంపరంగి బుజ్జిబాబు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జీకె.వీధి, చింతపల్లి మండలాల పరిధిలో ఎవరైనా వివిధ కారణాల వలన మరణిస్తే వారికి పోస్టుమార్టం నిర్వహించడానికి అనేక ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మృతదేహాలకు ప్రైవేట్ వ్యక్తుల ద్వారా పోస్టుమార్టం నిర్వహించడం జరుగుతుందన్నారు. వారు భారీగా డబ్బులు డిమాండ్ చేస్తున్నారని, అంతమొత్తం నిరుపేద గిరిజనులు చెల్లించలేని పరిస్థితిలో ఉన్నారని వాపోయారు. తప్పనిసరి పరిస్థితుల్లో పోస్టుమార్టం చేసే ప్రైవేట్ వ్యక్తులకు నచ్చజెప్పితే రూ.4000 నుంచి రూ.5000 వరకు ఇవ్వవలసి వస్తుందన్నారు. పోస్టుమార్టం చేసిన మృతదేహాన్ని వారి స్వగ్రామం తరలించాలంటే రూ.5000 నుంచి రూ.10000 ప్రైవేటు వాహనానికి ఇవ్వాల్సి వస్తుందని పేర్కొన్నారు. మొత్తం ఖర్చు రూ.20వేలు పైబడి అవుతుందన్నారు. చింతపల్లి ఆస్పత్రిలో వాహనాన్ని ఏర్పాటు చేయాలని, పోస్టుమార్టం చేయడానికి వైద్యాధికారి నియమించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై ఐటీడీఏ పిఒ గోపాలకృష్ణ, కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి స్పందించాలని బుజ్జి బాబు డిమాండ్ చేశారు.


మాట్లాడుతున్న ఎంపిటిసి సభ్యులు బుజ్జిబాబు


సంతలో ప్రచారం చేస్తున్న గిరిజన సంఘం నేతలు

కాఫీ రైతులకు బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి-పాడేరు: కాఫీ రైతుల ప్రోత్సాహకాల బకాయి సొమ్ము వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 17న పాడేరు ఐటిడిఎ వద్ద కాఫీ రైతుల ధర్నా నిర్వహిస్తున్నట్లు గిరిజన సంఘం చింతపల్లి మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవి తెలిపారు. ఈ మేరకు బుధవారం చింతపల్లి సంతలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో కాఫీ రైతులకు కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా ఆయన చింతపల్లి సంతకు వచ్చిన పలు గ్రామాల కాఫీ రైతులతో మాట్లాడారు. కాఫీ రైతులకు ప్రోత్సాహక నిధులు ఐటిడిఎ జమ చేయలేదన్నారు. కాఫీ రైతులకు ప్రభుత్వం కేటాయించిన కోట్లాది రూపాయలను ఐటిడిఎ పీవో నిర్లక్ష్యం చేసి వారి పొట్ట కొడుతున్నారని ఆరోపించారు. ఏజెన్సీ వ్యాప్తంగా దాదాపు రూ.60 కోట్ల 32 లక్షల 50 వేల బకాయిలు ఉన్నాయని, చెల్లింపులో ఐటిడిఏ తీవ్ర జాప్యం చేస్తోందని విమర్శించారు. ఇప్పటికే గిరిజన సంఘం పలుమార్లు పోరాటాల ద్వారా తెలియజేసినా ఐటిడిఏ పీవో మాత్రం స్పందించలేదన్నారు. ఇప్పటికైనా ఐటిడిఏ పీవో కాఫీ రైతుల ప్రోత్సాహక నిధుల సొమ్మును రైతుల ఖాతాల్లో జమ చేయకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కాఫీ రైతుల సమస్యలపై గిరిజన ప్రజాప్రతినిధులు, ఉన్నత అధికారులు స్పందించకపోవడం విమర్శించారు. ఎంపీ, ఎమ్మెల్యేలు తక్షణమే స్పందించి కాఫీ రైతుల బకాయి సొమ్మును రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 17న పాడేరు ఐటిడిఏ వద్ద ఉదయం 11 గంటలకు నిర్వహించే కాఫీ రైతుల ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. చింతపల్లి మండలంలో కాఫీ రైతుల మండల సదస్సు ఈనెల 10న గిరిజన ఉద్యోగుల భవనం వద్ద ఉంటుందని కాఫీ రైతులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు మజ్జి రాంబాబు, కిల్లో సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీపై నిరసన

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ: ఫీజుల పేరుతో విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేసి ఆత్మహత్యలు చేసుకునే విధంగా ప్రేరేపిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.ఏజేంద్రకుమార్, విశాఖ జిల్లా కార్యదర్శి యు.నాగరాజు మాట్లాడుతూ, అనంతపురం జిల్లాలోని నారాయణ కళాశాలలో చదువుతున్న భవ్యశ్రీ ఫీజు కట్టాలని లేకపోతే రికార్డులు ఇవ్వబోమని భయభ్రాంతులకు గురిచేయడంతో ఆ అమ్మాయి కళాశాల భవనం పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిందని తెలిపారు. కొన్ని నెలల క్రితం విశాఖ పరిధి పరదేశిపాలెంలోని నారాయణ కళాశాల హాస్టల్లో ఒక అబ్బాయి ఆత్మహత్య చేసుకున్నాడని పేర్కొన్నారు. రెండు వారాల క్రింద జివిఎంసి 4వ వార్డులోని శ్రీ చైతన్య రెసిడెన్షియల్ హాస్టల్లో ఒక అమ్మాయి చనిపోయిందన్నారు. ఆయా ఘటనల్లో అధికారులు బదిలీ చేస్తున్నారు తప్ప కళాశాలల యాజమాన్యాలపై ఎటువంటి చర్యలూ లేవన్నారు. విద్యార్థులను తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్న ప్రయివేట్, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని, ఫీజుల దోపిడిని అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీను, నాయకులు పవన్, జీవన్, శేఖర్ పాల్గొన్నారు.

రాజ్యసభ అధ్యక్ష పీఠంపై విజయసాయిరెడ్డి

ప్రజాశక్తి-గ్రేటర్ విశాఖ బ్యూరో : రాజ్యసభ సభ్యునిగా 2019లో ఎంపికైన విజయసాయిరెడ్డికి బుధవారం ప్యానల్ వైస్ చైర్మన్‌గా అధ్యక్ష పీఠంపై కూర్చునే అవకాశం లభించింది. అధ్యక్ష పీఠంపై కూర్చొన్న విజయసాయిరెడ్డి సభా కార్యకలాపాలను సజావుగా నడిపించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సభలో జరిగిన చర్చలో పలువురు ఎంపీలకు మాట్లాడే అవకాశం కల్పించారు. అంతకు ముందు గత ఏడాది ఆగస్టులో జరిగిన వర్షాకాల సమావేశాల్లో విజయసాయిరెడ్డి మొట్టమొదటి సారిగా అధ్యక్ష పీఠంపై కూర్చునే అవకాశం దక్కించుకున్నారు.

సమస్యలు పరిష్కరించాలని...

జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి కార్మికుల నిరసన

ప్రజాశక్తి-పాడేరు: పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ కార్మికులు బుధవారం మధ్యాహ్నం ఆసుపత్రి ఎదుట తమ సమస్యల పరిష్కారానికై నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి ఎల్.సుందర్‌రావు మాట్లాడుతూ, జిల్లాలో వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో గిరిజన ప్రాంతంలో ప్రభుత్వ ఆసుపత్రిలు పాడేరు, అరకు వేలి, చింతపల్లి, ముంచంగిపుట్టు కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ఏరియా ఆసుపత్రిలో పారిశుధ్య, సెక్యూరిటీ కార్మికులకు కనీస వేతనం రూ.16వేలు చెల్లించాల్సి ఉందన్నారు. కార్మికుల జీతాల నుండి ప్రావిడెంట్ ఫండ్, ఈఎస్ఐ కోత విధించి మిగిలిన జీతం ఇవ్వవలసి ఉండగా, కాంట్రాక్టర్ కేవలం సానిటేషన్ కార్మికులకు రూ.9000ల నుండి 10,700 మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. సెక్యూరిటీ కార్మికులకు కేవలం రూ.8366లు మాత్రమే చెల్లిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం నిర్ణయించిన జీతం ప్రకారం పీఎఫ్ ,ఈఎస్ఐ సొమ్ము జమ చేయగా, ప్రతి కార్మికులకు కనీస వేతనం రూ.13,900 జీతం ఇవ్వాల్సి ఉందన్నారు. కాంట్రాక్టు తక్కువ వేతనం ఇస్తున్నారని, దీనిపై ఆసుపత్రి అధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. పాత కాంట్రాక్టర్ పిఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా జమ చేయలేదని, దీంతో కార్మికులు నష్టపోతున్నారన్నారు. కొత్తగా వచ్చిన కాంట్రాక్టర్ కార్మికులకు కొత్త పిఎఫ్ నెంబర్లు వెంటనే ఇవ్వాలన్నారు. అనంతరం కార్మికులు మాట్లాడుతూ, తమకు ముఖ ఆధారిత హాజరు, బయోమెట్రిక్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో సరిపడ్డ కార్మికులు సంఖ్య పెంచాలని, ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనం అమలు చేయాలన్నారు.పాత కాంట్రాక్టర్ చెల్లించవలసిన పిఎఫ్ సొమ్ము వెంటనే చెల్లించాలని, కొత్తగా వచ్చిన కాంట్రాక్టర్ కార్మికులకు కొత్త పిఎఫ్ నెంబర్లు ఇచ్చి ప్రతి నెల పిఎఫ్ జమ చేయాలన్నారు. యూనిఫామ్ అలవెన్స్, సేఫ్టీ పరికరాలు అందించాలని కోరారు. అనంతరం పాడేరు జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ కే.కృష్ణారావుకు వినతి పత్రం అందజేశారు. నెలాఖరు లోపు తమ సమస్యలు పరిష్కరించకుంటే పనులు నిలుపు చేసి సమ్మె చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మిక యూనియన్ జిల్లా కార్యదర్శి ఆర్.ముత్యాలమ్మ, గాటి లక్ష్మి, నాగలక్ష్మి, సెక్యూరిటీ కార్మికులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న కార్మికులు, నాయకులు

గిరిజన వలస కార్మికులకు భద్రత ఏదీ?

పని ప్రదేశాల్లో మృతి చెందినా పట్టించుకనేవారేరీ
సిఐటియు జిల్లా అధ్యక్షుడు చిన్నయ్య పడాల్


వలస కార్మికులపై సర్వే చేస్తున్న పడాల్

ప్రజాశక్తి-పాడేరు: సొంత గ్రామాలను విడిచిపెట్టి జీవనోపాధి కోసం సుదూర ప్రాంతాలకు పనులు చేయడానికి వలస వెళ్లే గిరిజన వలస కార్మికులకు భద్రత లేకుండా పోయిందని సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ తెలిపారు. చింతపల్లి మండలంలోని చౌడుపల్లి పంచాయతీ చవటపాడు గ్రామంలో బుధవారం ఆయన వలస కార్మికుల సర్వే నిర్వహించారు. గిరిజన ప్రాంతంలో పనులు లేక వ్యవసాయ పనులు ప్రారంభం అయ్యే వరకు వేరే ప్రాంతాలకు వెళ్లి పనులు చేస్తున్న గిరిజనులు అనేకమంది ఉన్నారన్నారు. పని చేసే చోట సరైన వసతి సదుపాయాలు లేకపోవడంతో అనారోగ్య పరిస్థితులు, ప్రమాదాల బారిన పడి మృత్యువాత పడుతున్నారన్నారు. పని చేసే చోట గిరిజనుల అమాయకత్వం అదునుగా చూసి చాలామందికి తక్కువ జీతాలు ఇవ్వటమే కాకుండా సరిగ్గా జీతాలు కూడా ఇవ్వని పరిస్థితి ఉందని అన్నారు. గిరిజన ప్రాంతం నుంచి కంపెనీలకు, చేపలు, రొయ్యలు చెరువులకు, ఇటుక బట్టీలు, తదితర పనుల నిమిత్తం గిరిజనులు వలస వెళుతున్నారని తెలిపారు. ఇటీవలే జీకే వీధి మండలం పెదవలస పంచాయతీ తూరుమామిడి గ్రామానికి చెందిన శెట్టి రమేష్ కర్నూలు జిల్లాలో చేపల చెరువుకు పని నిమిత్తం వెళ్లి చెరువులో పడి మృతి చెందాడన్నారు. ఆ చేపల చెరువు యజమాని రమేష్ మృతదేహాన్ని సొంత గ్రామానికి తీసుకొచ్చి వదిలేసి వెళుతుంటే యజమానిని పట్టుకొని గిరిజన సంఘం జోక్యం చేసుకోవడంతో రూ.1,90,000వేలు నష్ట పరిహారం ఇవ్వడానికి యజమాని అంగీకరించి, తక్షణమే రూ.50 వేలు ఇచ్చి మిగతాది ఇచ్చేందుకు నెల రోజులు గడువు కోరారని తెలిపారు. ఇటువంటి సంఘటనలు గిరిజన ప్రాంతంలో అనేకం ఉన్నాయన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో గిరిజన ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లి పనులు చేస్తున్న వలస కార్మికులు సిఐటియుకి సమాచారం ఇవ్వాలన్నారు. వలస కార్మికులకు చట్టం ఉన్నప్పటికీ చాలా తక్కువ కూలి చెల్లించి గిరిజనులతో పనులు చేయించుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి సహాయం చేయాలన్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లే వలస కార్మికులు ఫోన్: 9440896147, 9398464584 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

'హెటిరో'పై పెరుగుతున్న నిరసన

పైపులైను అనుమతులపై అభ్యంతరం
ఉపసంహరించుకోవాలని కేంద్ర పర్యావరణ శాఖ కార్యదర్శికి లేఖ
ఆందోళనకు అండగా రాజయ్యపేట పంచాయతీ

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, నక్కపల్లి విలేకరి

హెటిరో డ్రగ్స్ కంపెనీకి కొత్తగా పైప్‌లైన్ అనుమతులు మంజూరుచేయొద్దని 2021 డిసెంబరు 1 నుంచి ఆందోళన చేపడుతున్న మత్స్యకారులకు ప్రజల మద్దతు పెరుగుతోంది. పైప్‌లైన్ ఏర్పాటుకు గత నెల 11న జారీచేసిన కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సిఆర్‌జెడ్) అనుమతుల ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని రాజయ్యపేట పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యులు, ఎంపిటిసి, జెడ్‌పిటిసి సభ్యులు మంగళవారం కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు. మత్స్యకార గ్రామాలైన రాజయ్యపేట, బోయపాడు, పెదతీనార్ల, చినతీనార్ల, దొండవాక, అమలాపురం, డిఎల్‌పురం, బంగారయ్యపేట, మత్స్యకారులు కొత్త పైప్‌లైన్‌కు వ్యతిరేకంగా చేస్తున్న ఆందోళనను పట్టించుకోకుండా అనుమతులు ఇవ్వడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. రాజయ్యపేట సర్పంచ్ పి.అప్పలసర్స, నక్కపల్లి జెడ్‌పిటిసి సభ్యులు గోసల కాసులమ్మ, ఎంపిటిసి సభ్యులు పిక్కి ముసలమ్మ, పంచాయతీ వార్డు సభ్యులు మైలపల్లి మహేష్‌బాబు, మైలపల్లి లోవలక్ష్మి, జామి రమణమ్మ, పిక్కి కామేశ్వరరావు, ఎస్.అప్పలనర్స, వి.సీత, పిక్కి అప్పలరాజు, పిక్కి కొండలరావు, మఠం గోవిందమ్మ, పిక్కి సత్తిబాబు కార్యదర్శికి పంపిన అభ్యంతర లేఖపై సంతకాలు చేశారు. సముద్ర తీరానికి అతిసమీపంలో అనుమతుల్లేకుండా నిర్మించిన డిశాలినేషన్ ప్రాజెక్టులు నిర్మించిన హెటిరోపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

'హెటిరో డ్రగ్స్ కంపెనీ ఉత్పత్తి ప్రారంభించినప్పటి నుంచి కనీస పర్యావరణ నిబంధనలు పాటించకుండా సముద్రంలోకి రసాయన వ్యర్థాలు విడిచిపెట్టడంతో సమీప మత్స్యకార గ్రామాల మత్స్యకారులకు జీవనోపాధి పోయింది. కంపెనీ రాకముందు సముద్రంలో వేటకు వెళ్లి కుటుంబాలను పోషించుకొనే మత్స్యకారులు, కంపెనీ వచ్చిన తరువాత వేటలేక బతకడానికి వలసలు వెళ్లాల్సివస్తోంది. పర్యావరణ నిబంధనలు పాటించకపోవడంతో తమ జీవనోపాధి దెబ్బతిన్నందున హెటిరోకు కొత్తపైప్‌లైన్‌కు అనుమతులు మంజూరుచేయవద్దని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జిటి)లో కేసు వేశాం. మత్స్యకారుల కేసుపై ఎన్‌జిటి నియమించిన జాయింట్ యాక్షన్ కమిటీ పర్యావరణానికి జరిగిన నష్టాన్ని అంచనావేసి హెటిరో కంపెనీ నుంచి రూ.6.94 కోట్లు అపరాదరుసుము వసూలుచేయాలని ఎన్‌జిటికి సిఫార్సు చేసింది. ఈ కేసు ఎన్‌జిటిలో వుండగానే కొత్త పైపులైన్‌కు (సిఆర్‌జెడ్) అనుమతులు మంజూరుచేసింది. మత్స్యకారుల జీవనోపాధిని, ఎన్‌జిటిలో వేసిన కేసు పూర్వపరాలను పరిశీలించకుండానే, పరిగణనలోకి తీసుకోకుండానే అనుమతులివ్వడంతో మత్స్యకారుల ఉపాధికి మరింత నష్టం జరగనుంది.

సిఆర్‌జెడ్ నిబంధనలు ఉల్లంఘించి డీశాలినేషన్ ప్రాజెక్టు హెటిరో నిర్మించింది. హెటిరో డ్రగ్స్ కంపెనీ వల్ల భూగర్భ జలాలు కలుషితమైన మత్స్యకార గ్రామాలకు తాగునీటి సౌకర్యం కల్పించలేదు. ఉపాధి పోయిన కుటుంబాలకు కంపెనీలో ఉద్యోగాలు ఇవ్వడంలేదు. యువత విద్యార్హతకు తగిన ఉద్యోగాలు కల్పించడంలేదు. పైప్‌లైన్ ఏర్పాటుకు పంచాయతీ తీర్మానం లేదు. ఎన్‌జిటిలో కేసును పరిగణనలోకి తీసుకొని పైప్ అనుమతులు ఉపసంహరించుకోవాలి.' అని కార్యదర్శికి మెయిల్‌లో పంపించిన లేఖలో పేర్కొన్నారు.

సమగ్ర శిక్ష అధికారులపై చర్య తీసుకోవాలి

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వైసిపి మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు ఓటు వేయాలని కోరుతూ కస్తూరిబా పాఠశాలల సిబ్బందికి దసపల్లా హోటల్‌లో మీటింగ్ ఏర్పాటుచేసిన సమగ్ర శిక్షా అధికారులు విసిడిఒ టి.వెంకటలక్ష్మి, ఎంఐఎస్ ప్లానింగ్ కో-ఆర్డినేటర్ శ్రీలక్ష్మి పట్ల చర్యలు తీసుకోవాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్‌చేశారు. ఈ నెల 5వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు దసపల్లా హోటల్‌లో సమావేశం ఉందని, డిఇఒ హాజరయ్యే ఈ సమావేశానికి అందరూ రావాలని, లేకుంటే చర్యలు ఉంటాయని కస్తూరిబా పాఠశాలల సిబ్బంది వాట్సప్ సందేశాలు పంపారని తెలిపారు. అయితే ఈ సమావేశానికి సీతంరాజు సుధాకర్ హాజరై తన అభ్యర్థిత్వాన్ని బలపర్చాలని కోరారని పేర్కొన్నారు. అధికార పక్షం తమ అధికారాన్ని దుర్వినియోగం చేస్తోందని, ఇది కొనసాగితే నిష్పక్షపాతంగా ఎన్నికలు జరగవని తెలిపారు. ఓటర్లను ప్రలోబాలకు గురిచేసి గెలవాలనుకోవడం ప్రజాస్వామ్యాన్ని ఖూనిచేయడమేనని పేర్కొన్నారు. దీనిపై విచారించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎపి ఎన్నికల కమిషన్‌కు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు పంపించినటు లోకనాథం తెలిపారు.

తోకరాయిలో ఎసిఎం స్ప్రేయింగ్

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం దారకొండ పంచాయతీ తోకరాయి గ్రామంలో దాసుల అనే గర్భిణికి మలేరియ పాజిటివ్ కేస్ నమోదైన నేపథ్యంలో నివారణ చర్యల్లో భాగంగా తోకరాయిలో బుధవారం ఎసిఎం స్ప్రేయింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా దారకొండ పిహెచ్సి వైద్యాధికారిణి డాక్టర్ హేమ బిందు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ముందస్తు చర్యల్లో భాగంగా ప్రజలు మలేరియా టైఫాయిడ్ డెంగు వంటి వ్యాధుల బారిన పడకుండా ఏసియం స్ప్రేయింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో మురికి కాలువలు, మురికి గుంతలు ఎక్కడెక్కడ ఉన్నాయి గుర్తించి ఆ ప్రదేశాల్లో స్ప్రేయింగ్ సిబ్బంది నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. రోగాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ఆశా వర్కర్లు ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పిస్తున్నారని చెప్పారు. ప్రతి ఒక్కరూ దోమతెరలు వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి కొండబాబు, ఎంఎల్టి శ్రావణి, హెల్త్ అసిస్టెంట్ గోవిందు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మురుగుకాలువ పరిశీలిస్తున్న వైద్యసిబ్బంది

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ షరీఫ్

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

ప్రజలు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని జడ్డంగి ఎస్ఐ షరీఫ్ అన్నారు. మండలంలోని జడ్డంగి గ్రామంలో బుధవారం పోలీసులు ఫేక్ లోన్స్, రహదారి భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై షరీఫ్ మాట్లాడుతూ గ్రామస్తులు గంజాయి, నాటుసారా, కోడిపందాలు, గుండాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు, చదువుకునే యువత చదువుతోపాటు క్రీడల పై ఆసక్తి కనబరచాలని, ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవాలని కోరారు. ఆన్లైన్ యాప్‌లు, ఫేక్ లోన్స్ వలన అనర్ధాలు జరుగుతున్న రీత్యా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్డంగి పోలీస్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

11, 12 తేదీలో హెచ్‌ఎం అకౌంట్స్ టెస్ట్

ప్రజాశక్తి - ఆరిలోవ : ఈనెల 11, 12, తేదీల్లో ప్రధానోపాధ్యాయుల అకౌంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు డిఇఒ ఎల్.చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షను విజయవాడ, కడప కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు జరుగుతుందని, అభ్యర్థులు తమ హాల్ టిక్కెట్లను www.bse.ap.gov.in అను వెబ్‌సైట్ నుంచి 7వ తేదీ నుంచి డౌన్ చేసుకోవచ్చని సూచించారు. హాల్ టిక్కెట్లు డౌన్ చేసుకునేందుకు రిజిస్ట్రేషన్ నెంబరు, పుట్టిన తేదీతో లాగిన్ కావాలని సూచించారు..

జాకీర్ హుస్సేన్‌కు ఘన సత్కారం

ప్రజాశక్తి-సీలేరు : ఏపీ జెన్కో సీలేరు ప్రాజెక్టు ఈఈగా పని చేస్తూ బదిలీపై నెల్లూరు జిల్లా కృష్ణపట్నం థర్మల్ విద్యుత్ కేంద్రానికి వెళ్తున్న జాకీర్ హుస్సేన్‌కు బుధవారం ఘనంగా వీడ్కోలు పలికారు. స్థానిక కళ్యాణ మండపంలో నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో సత్కరించారు. ఇన్‌ఛార్జి ఎస్ఈ సివిల్ బాబూరావు, నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఈఈ ప్రభాకర్, ఏడిఈ క్యాంపు అప్పలనాయుడు, ఏఈ సురేష్, ఎలక్ట్రికల్, సివిల్, ఇంజనీర్ల కార్మిక సంఘం నాయకులు, పాత్రికేయులు, ఆఫీస్ స్టాఫ్, కాంట్రాక్ట్ కార్మికులు జాకీర్ హుస్సేన్ దంపతులకు దుశ్శాలవతో సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా బాబూరావు, అప్పలనాయుడు, సురేష్ మాట్లాడుతూ జాకీర్ హుస్సేన్ అంకితభావంతో పని చేశారని,ఆయన్నుంచి ఎన్నో ప్రతిభా పాఠాలు నేర్చుకున్నామని కొనియాడారు. కార్మికులు విధులకు హాజరు కాకముందే తన కార్యాలయంలో జాకీర్ హుస్సేన్ విధుల్లో ఉండే వారిని తెలిపారు. ప్రతిరోజూ ఫీల్డ్ మీద జరిగిన పనులపై ప్రత్యేక దృష్టి సారించి, జరుగుతున్న పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండేవారని చెప్పారు. అనంతరం జాకీర్ హుస్సేన్ ఇచ్చిన విందు భోజనాలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో వెంకటరెడ్డి, ఏడిఈలు క్రాంతి, శ్రీనివాసరావు, ఏఈలు కృష్ణారావు, రమేష్, అప్పలనాయుడు, సబ్ ఇంజనీర్ శ్రీనివాస్, స్థానిక ఎంపీటీసీ పిల్ల సాంబమూర్తి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వినోద్ బాబు, ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్రీనివాస్, డిఏవి పాఠశాల ఉపాధ్యాయులు, కాంగ్రెస్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.


జాకీర్ హుస్సేన్ దంపతులను సత్కరిస్తున్న జెన్‌కో ఉద్యోగులు

టార్గెట్‌బాల్ క్రీడలో రాణించాలి

అఖిల భారత ఇంటర్ వర్సిటీ పోటీల ప్రారంభంలో గీతం అధ్యక్షుడు శ్రీభరత్


పోటీలను ప్రారంభిస్తున్న శ్రీభరత్

ప్రజాశక్తి -మధురవాడ : భారతీయ క్రీడగా ఇటీవలి ప్రసిద్ధి చెందిన టార్గెట్ బాల్‌లో భారతీయ యువత రాణించి, అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదగాలని గీతం విద్యాసంస్థల అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ ఆకాంక్షించారు. అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు గీతం వర్సిటీలో నిర్వహించనున్న అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల టార్గెట్‌బాల్ పోటీలను ప్రారంభించారు. టార్గెట్ బాల్ వంటి నూతన క్రీడల ద్వారా త్వరితంగా జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుందన్నారు. భారతీయ టార్గెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సోనూశర్మ మాట్లాడుతూ హ్యాండ్‌బాల్, బాస్కెట్‌బాల్‌ను కలిసి టార్గెట్‌బాల్ క్రీడగా 2012లో మధురలో ప్రారంభించగా, 2017 నుంచి భారతీయ విశ్వవిద్యాలయాల సంఘం దీన్ని ప్రోత్సాహిస్తోందన్నారు. గీతం క్రీడా విభాగం డైరక్టర్ అరుణ్ కార్తీక్ మాట్లాడుతూ గీతం వేదికగాజరుగుతున్న పోటీలోదేశంలోని 29 విశ్వవిద్యాలయాల నుంచి 350 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని వెల్లడించారు.కార్యక్రమంలో గీతం ప్రొ వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వై. గౌతమ్‌రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, గీతం క్రీడా విభాగం డిప్యూటీ డైరక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రీడా పతాకాలను ఎగురవేసి క్రీడా ప్రతిజ్ఞ చేశారు.

12న బొకారోలో కన్వెన్షన్



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కార్మికులు, నేతలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఈనెల 12న బొకారోలో జరుగు ఆల్ ఇండియా స్టీల్ కాంట్రాక్టు వర్కర్ కన్వెన్షన్‌ను జయప్రదం చేయాలని యూనియన్ గౌరవ అధ్యక్షులు ఒ.వి.రావు కోరారు. బుధవారం స్టీల్ ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ ఆధ్వర్యంలో కన్వెన్షన్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఒ.వి.రావు మాట్లాడుతూ స్టీల్ కాంట్రాక్టు కార్మికులకు. ఎన్‌జెసిఎస్‌లో మాదిరిగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు.ఐదేళ్లకోసారి వేతన సవరణ చేస్తూ కేంద్ర ప్రభుత్వం జిఒజారీ చేయాలన్నారు. దేశ వ్యాప్తంగా అన్ని స్టీల్ పరిశ్రమల్లోని కాంట్రాక్టు కార్మిక నేతలు 12న బోకారో కన్వెన్షన్‌లో పాల్గొంటారని, భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తారన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు జి శ్రీనివాసరావు. యు సోమేష్. అంకం రెడ్డి శ్రీను. ఎన్ దేముడు. నాయుడు. సిహెచ్ పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న సిఐ స్వామినాయుడు

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని కొండగోకిరి గ్రామంలో లోకుల గాంధీ పేరుతో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను కొయ్యూరు సిఐ స్వామి నాయుడు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్య, క్రీడల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాజారావు, మురళీ కృష్ణ, సర్పంచ్ రేగడి ముసలినాయుడు, లింగం పేట ఎంపిటిసి నాని, వైసీపీ నాయకుడు కవి, లోకుల గాంధీ కుటుంబ సభ్యులు లోకుల కిరణ్, రమేష్ పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సిఎం జగన్



గృహసారథులకు కిట్లు అందజేస్తున్న చొక్కాకుల వెంకటరావు, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి- సీతమ్మధార : పేదల అభ్యున్నతికి నిరంతరం తపించే నిరుపేదల పక్షపాతి సిఎం జగన్ అని పాడేరు నియోజకవర్గ వైసిపి పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు అన్నారు. బుధవారం పాడేరు నియోజకవర్గం చింతపల్లి మండలం అన్నవరం పంచాయతీలో పాడేరు ఎమ్మెల్యే కె. భాగ్యలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల శిక్షణ తరగతులలో మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు మరింత చేరువచేయాలన్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని పిలుపునిచ్చారు కార్యక్రమంలో రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ నెంబర్ డాక్టర్ టి. నర్సింగరావు చింతపల్లి ఎంపిపి కొరాభూ అనూష దేవి, జెడ్‌పిటిసి పోతురాజు బాలయ్య పడాల్, మార్కెటింగ్ కమిటీ చైర్‌పర్సన్ రాజులమ్మ, సర్పంచ్, ఎంపిటిసిలు, వైసిపి నేతలు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో కంచి కామకోటి పీఠాధిపతి

ప్రజాశక్తి -సింహాచలం: సింహాద్రి అప్పన్నను కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీ బుధవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ఆలయ సంప్రదాయ ప్రకారం సాగర స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన కొండ దిగునున్న దేవస్థానం వేద పాఠశాలను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించి, సలహాలు, సూచనలు చేశారు.